క్లుప్తంగా

లక్ష్మీ నరసింహుడికి బంగారు బాసికాలు



బంగారు బాసికాలను అర్చకుడికి అందజేస్తున్న దాతలు

అద్దంకి: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ క్షేత్రాధిపతి లక్ష్మీ నరసింహస్వామికి కల్యాణ సమయంలో ఉపయోగించే బంగారు బాసికాలను మంగళవారం ఒంగోలుకు చెందిన దంపతులు అందజేశారు. దాతలు ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన ఉండవల్లి చంద్రశేఖర్, మధులత దంపతులు దేవస్థాన అర్చకులకు అందజేశారు. దాతలకు ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నేడు పర్చూరుకు కలెక్టర్ రాక

పర్చూరు (చినగంజాం): జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా బాపట్ల జిల్లా కలెక్టర్ పీ రంజిత్ బాషా బుధవారం పర్చూరుకు రానున్నట్లు మండల పరిషత్ కార్యాలయం అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. స్థానిక అద్దంకి నాంచారమ్మ కళ్యాణ మండపంలో మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి గ్రామ రెవెన్యూ అధికారులు, కార్యదర్శులు సచివాలయ సిబ్బంది ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని వారు పేర్కొన్నారు.

మండల అభివృద్ధికి ప్రణాళికలతో సిద్ధం



శోభారాణి, ఎంపీడీవో

చీరాల టౌన్: పంచాయతీల్లో సమస్యలను పరిష్కరించి అభివృద్ధి పథంలో మండలాన్ని నడిపిస్తానని నూతన ఎంపీడీవో ఎం.శోభారాణి తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా విధుల్లో చేరిన ఎంపీడీవో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మండలంలోని పదిహేను గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయించడంతో పాటుగా పెండింగ్ పనులను త్వరగా ప్రారంభించేందుకు కృషి చేస్తానన్నారు. నూతన ఎంపీడీవోకు కార్యాలయ ఏవో శ్రీనివాసరావు, పలువురు కార్యదర్శులు పుష్పగుచ్ఛాలు అందించారు.

రోడ్డు భద్రతతో ప్రమాదాలకు చెక్



బహుమతులను అందజేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

అద్దంకి: రోడ్డు భద్రతతో ప్రమాదాలకు చెక్ పెట్టవచ్చని డిపో టీఐ నాగేశ్వరరావు అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మండలంలోని తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం రోడ్డు భద్రతపై విద్యార్థులకు క్విజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డిపోకు చెందిన ఏడుకొండలు, ఎస్‌డీఐ రత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు ఆర్థికాభివృద్ధికి చేయూత



హనిమిరెడ్డితో వ్యవసాయ పరపతి సంఘ అధ్యక్షుడు, సభ్యులు



హనిమిరెడ్డికి మద్దతు తెలుపుతున్న గరటయ్య కాలనీ, కాకానిపాలెం వాసులు

- నియోజకవర్గ సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

అద్దంకి: ప్రాటదమిక వ్యవసాయ పరపతి సంఘం ద్వారా రైతు ఆర్థికాభివృద్ధికి సంఘ సభ్యులు చేయూతనివ్వాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పాణెం చిన హనిమిరెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో హనిమిరెడ్డి నూతనంగా ప్రకటించిన నాగులపాడు వ్యవసాయ పరపతి సంఘ అధ్యక్షుడు మానికొండ నాగరాజు, సభ్యులు వెంగలశెట్టి వెంకటేశ్వర్లు, భీమనాథం రాఘవరెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ ద్వారా రైతులకు పంటలు పండించుకోవడం కోసం రుణాలు అందించేందుకు కృషిచేయాలన్నారు. పనుల్లో పారదర్శకత ఉండాలని చెప్పారు. రుణాల కోసం వచ్చిన రైతులను అధికారులు వేధించకుండా చూడాలన్నారు. అర్హత ఉన్న ప్రతి రైతుకు రుణం అందేలా కృషిచేయాలని చెప్పారు. వారి వెంట పట్టణ పార్టీ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

హనిమిరెడ్డికి మద్దతు తెలిపిన కాకానిపాలెం కాలనీవాసులు

పట్టణంలోని కాకినాపాలెం, గరటయ్య కాలనీకి చెందినవారు సమన్వయకర్త చిన హనిమిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి తమ మద్దతును తెలియజేశారు. మీ వెంటే ఉండి విజయానికి తోడ్పాటునిస్తామని చెప్పారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని, అద్దంకిలో హనిమిరెడ్డిని ఎమ్మెల్యేగా చేసుకోవాల్సిన అవసరం ఉందని వారు అన్నారు. కార్యక్రమంలో కాకానిపాలెం, గరటయ్య కాలనీకి చెందిన యువకులు పెద్దలు ఉన్నారు.

దేవుడియందు విశ్వాసంతో జీవించాలి



చర్చి ప్రతిష్టలో మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త వెంకటేష్

- నియోజకవర్గ సమన్వయకర్త కరణం

చీరాల టౌన్: దళిత క్రైస్తవులు అందరు ఐక్యంగా ఉండి ప్రభు ఏసుక్రీస్తు యందు భయభక్తులు, విశ్వాసంతో జీవించాలని చీరాల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కరణం వెంకటేష్ సూచించారు. మంగళవారం పట్టణంలోని శాంతి నగర్‌లో నూతనంగా నిర్మించిన కమలమ్మ మెమోరియల్ బాపిస్ట్ చర్చి పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ ఇన్‌చార్జి హాజరయ్యారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం చర్చిని ప్రారంభించారు. ఈసందర్భంగా కరణం వెంకటేష్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు సూక్తులను పాటిస్తూ ప్రతి ఒక్కరు దేవుని పరిచర్య చేస్తు విశ్వాసంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కౌన్సిలర్లు కె.యానాధిరావు, కె.వెంకటరావు, బి.అనీల్, నాయకులు, కార్యకర్తలు, సంఘస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జేఏఎస్ క్యాంపులతో అందరికీ ఆరోగ్యం



రోగులను పరీక్షించి సూచనలిస్తున్న వైద్యాధికారి

బల్లికురవ: ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులతో గ్రామాల వారీగా పేదలందరికి కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నామని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ్ అహమ్మద్ అన్నారు. మంగళవారం మండలంలోని వేమవరం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత క్యాంపు నిర్వహించారు. క్యాంపులో భాగంగా 322 మందికి వివిధ రకాల పరీక్షలు చేశారు. 36 మందికి కంటి వెలుగులో భాగంగా కంటి పరీక్షలు చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ మే 7వతేదీ వరకు షెడ్యూల్ ప్రకారం గ్రామాల వారీగా శిబిరాలు నిర్వహిస్తారన్నారు. శిబిరంలో వైద్యాధికారులు రవితేజ, భాను తేజశ్వని, వైద్యసిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



రాజకీయ పార్టీ నాయకులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి

అద్దంకి రూరల్: ఎన్నికలు సక్రమంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని అద్దంకి నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేకాధికారి సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై రాజకీయపార్టీ నాయకులతో సమీక్షించారు. ఈసందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ తుది ఎన్నికల జాబితా వచ్చిన తరువాత అభ్యంతరాలను పరిశీలించటానికి వీలుపడన్నారు. గ్రామాల్లో ఇంకా మృతులకు పేరుతో ఓట్లు ఉన్నాయని వాటిని పరిశీలించి తొలగించాలని పార్టీల నాయకులు కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ మహబూబ్ సుభాని, డీటీ సుధారాణి, రాజకీయపార్టీల నాయకులు పాల్గొన్నారు.

మార్చి 9న జాతీయ లోక్‌అదాలత్

పర్చూరు (చినగంజాం): దేశ వ్యాప్తంగా మార్చి 9వ తేదీ జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో బాగంగా పర్చూరు కోర్టు ప్రాంగణంలో లోక్ అదాలత్ జరుగుతుందని పర్చూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ కే ప్రశాంతి తెలిపారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, భరణం కేసులు, నగదు బాకీ వసూలు కేసులు, చెక్ బౌన్స్ కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, కోర్టులు వరకు వెళ్లని ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించుకోవాల్సిందిగా ఆమె తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వ్యవసాయ యంత్ర పరికరాలు చోరీ

అద్దంకి రూరల్: మండలంలోని మణికేశ్వరం గ్రామ పీఏసీఎస్ భవనంలో ఉంచిన యంత్రాలు శనివార చోరీ జరగ్గా మంగళవారం పీఏసీఎస్ సీఈవో షేక్ రహీమ్ పోలీస్ స్టేషన్ ఎస్సై వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. సుమారు రూ.30 వేలు విలువ కలిగిన రెండు సీసీ కెమెరాలు, శనగలు, వడ్లు, మొక్కజొన్నలు క్లీనింగ్ చేసే పరికరాలు దొంగిలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

46 మద్యం బాటిళ్లు స్వాధీనం

చీరాల రూరల్: సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లో అక్రమంగా మద్యం తరలిస్తుండగా జీఆర్పీ పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం 46 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొండయ్య వివరాల మేరకు.. చెన్నై నుంచి విజయవాడ వైపు వెళ్తున్న సర్కార్ ఎక్స్‌ప్రెస్ చీరాల రైల్వే స్టేషన్‌లోని నాలుగో నంబర్ ప్లాట్‌ఫాంపై నిలిచింది. దీంతో ఎస్సై తన సిబ్బందితో ఎస్-1 బోగిలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమానాస్పదంగా ఉన్న బ్యాగులు తనిఖీలు చేయగా అందులో 42 మద్యం ఫుల్ బాటిళ్లు లభ్యమయ్యాయి. దీంతో స్పందించిన ఎస్సై బ్యాగుల వద్ద అనుమానస్పదంగా ఉన్న వారిని అదుపులోకి తీసుకుని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యద్దనపూడి వీఆర్‌ఏ మృతి



మీరాసాహెబ్ (ఫైల్)

యద్దనపూడి: మండల కేంద్రమైన యద్దనపూడి గ్రామంలో వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్న షేక్ మీరాసాహెబ్ (60) సోమవారం రాత్రి అకస్మికంగా మృతిచెందారు. 30 సంవత్సరాలుగా ఆయన వీఆర్‌ఏగా పనిచేసి అందరి మన్ననలు పొందారు. మృతిచెందిన మీరాసాహెబ్ మృతదేహాన్ని ఇన్‌చార్జ్ తహశీల్దారు విష్ణుప్రసాద్, మండలంలోని వీఆర్‌ఓలు , వీఆర్‌ఏలు సంతాపం తెలిపి కుటుంబాన్ని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మట్టిఖర్చుల నిమిత్తం రూ.25 వేలు నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. మీరాసాహెబ్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ





నక్కబొక్కలపాడు-నాగరాజుపల్లి మధ్య చకాచకా సాగుతున్న రోడ్డు పనులు


- హనిమిరెడ్డి సహకారంతో రోడ్ల అభివృద్ధి
- సంతోషం వ్యక్తం చేస్తున్న వాహనదారులు, ప్రజలు

బల్లికురవ: గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా సమస్యలు పేరుకుపోయి చాలా ఇబ్బందులు పడ్డారు. కనీసం అధికారులు సైతం వాటిని పట్టించుకున్న పాపానా పోలేదు. ఎన్నో సంవత్సరాలుగా చిల్లచెట్లతో మూసుకుపోయి గోతులతో అధ్వానస్థితికి చేరిన రోడ్లను అద్దంకి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పాణెం చిన హనిమిరెడ్డి సహకారంతో అభివృద్ధి పరుస్తున్నారు. అభివృద్ధి పనులు చురుకుగా ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో తుదిదశకు చేరుతున్నాయి. బల్లికురవ-మార్టూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు గ్రానైట్ భారీ వాహనాల రాకపోకలతో అధ్వానస్థితికి చేరి ప్రయాణం సాగటం లేదు. గోతులతో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతుంది. ఈరోడ్డు నక్కబొక్కలపాడు గ్రామం నుంచి నాగరాజుపల్లి వరకు నాలుగు కిలోమీటర్లు అభివృద్ధికి నోచలేదు. ప్రభుత్వం మూడు సంవత్సరాల క్రితం నిధులు మంజూరుతో టెండర్ పిలిచింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ భారీ వాహనాల రాకపోకల నిర్వహణకు భరోసా ఇవ్వలేక పనులు చేపట్టేందుకు ముందుకు రాలేదు. అధ్వాన్న స్థితికి చేరిన రోడ్డు విషయాన్ని ఇటీవల బల్లికురవలో స్థానికులు, వలంటీర్లు హనిమిరెడ్డి దృష్టికి తీసుకురాగా ఆయన తక్షణమే స్పందించారు. నక్కబొక్కలపాడు సర్పంచ్ ధూళిపాళ్ల రామయ్యకు పనులు చేయించే బాధ్యతను అప్పగించారు. మంగళవారం నక్కబొక్కలపాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల నుంచి పనులకు శ్రీకారం చుట్టగా ఆదివారం సాయంత్రంతో పనులు కొంతమేర ముగిశాయి. నాలుగు కిలో మీటర్లలో రోడ్డును కమ్మిన చిల్లచెట్లను పొక్లెయిన్‌తో తొలగించి గోతుల్లో మట్టివేసి చదును చేశారు. వాటర్ ట్యాంకర్‌తో రెండు రోజులుగా నీళ్లు చల్లిస్తున్నారు. రోలర్ తిప్పి వెట్ మిక్స్ వేస్తే రాకపోకలకు పూర్తిగా ఇబ్బందులు తొలగుతాయని సర్పంచ్ వివరించారు. పనులను ఆర్‌అండ్‌బీ జేఈ బాజ్జి, వర్క్ ఇన్‌స్పెక్టర్ మర్రి కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి పీ. బ్రహ్మారెడ్డి, పర్యవేక్షిస్తున్నారు.

కోటావారిపాలెం రోడ్డు అభివృద్ధి..

పంచాయతీ రాజ్ శాఖ ఆధీనంలో ఉండి ఎన్నో సంవత్సరాలుగా అభివృద్ధికి నోచని కొప్పరపాలెం-కోటవారి పాలెం 4 కిలోమీటర్ల రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి పరిచారు. చిల్లచెట్లు తొలగించి గోతులను పూడ్చి రాకపోకలకు ఇబ్బందులు తొలగించారు. మండలంలోని ప్రధాన రోడ్లను అభివృద్ధి పరచటం పట్ల వాహనదారులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వెట్‌మిక్స్ వేస్తే ఇబ్బందులు తొలగినట్లే..



“అద్దంకి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పాణెం చిన హనిమిరెడ్డి సహకారం అందించటం వల్ల ఎన్నో సంవత్సరాలుగా అభివృద్ధికి నోచని నక్కబొక్కలపాడు, నాగరాజుపల్లి రోడ్డును 6 రోజుల్లో 50 శాతం మేర అభివృద్ధి పరిచారు. రోలర్ తిప్పి చదరంతో వెట్‌మిక్స్ వేస్తే రాకపోకలకు పూర్తిగా ఇబ్బందులు తొలగుతాయి. గతంలో రోడ్డుకు రెండు వైపుల చిల్లచెట్లు పెరగటం, గోతుల వల్ల తరచూ వాహనదారులు ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఆ ఇబ్బందులను కొంతమేర తొలగించగలిగారు. ప్రస్తుతం రోడ్డు విశాలంగా అవడంతోపాటు రాకపోకలకు ఇబ్బందులు తొలగించగలిగానని తృప్తి పడుతున్నాను.”

– ధూళిపాళ్ల రామయ్య, సర్పంచ్

నేడు చిదంబరశాస్త్రికి సన్మానం

చీరాల అర్బన్: అయోధ్యలో గత నెల 22న ప్రతిష్ఠించిన బాలరాముని విగ్రహం కింద స్థాపించిన రామ యంత్రానికి కోటానుకోట్ల జపం చేసి యంత్రానికి బలం చేకూర్చిన అన్నదానం చిదంబరశాస్త్రి చీరాల వాసి కావడం ఎంతో అదృష్టమని క్షీరపురి బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం స్థానిక ఎన్‌పీఎస్అండ్ఎస్‌జేఆర్ కళ్యాణ మండపంలో క్షీరపురి బ్రాహ్మణ సేవా సంఘం, చీరాల పురోహిత సేవా సంఘం, చీరాల ఘంటసాల సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఆయనకు అభినవ రామదాసు బిరుదును అందించి ఘనంగా సత్కరిస్తున్నట్లు తెలిపారు.

నేడు చినగంజాంలో ఆసరా చెక్కుల పంపిణీ

చినగంజాం: మండల కేంద్రం చినగంజాంలో బుధవారం జరగనున్న వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, ఆమంచి కృష్ణమోహన్ హాజరు కానున్నట్లు పర్చూరు వైఎస్సార్ సీపీ కార్యాలయ ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో ఆయన పాల్గొని మహిళా గ్రూపులకు చెక్కులు పంపిణీ చేస్తారని వారు తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని వారు కోరారు.

నిత్యావసరాలు పంపిణీ

చీరాల రూరల్: వాకర్స్ ఇంటర్నేషనల్ ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూలు చీరాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక హైస్కూలు క్రీడా మైదానంలో సేవా కార్యక్రమంలో భాగంగా దాతలు గీతిక ఆనంద్ చైతన్య మనోవికాస కేంద్రానికి, రామస్తంభం అనాథశ్రమానికి బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, గురుప్రసాద్, సుధాకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు వారధి వలంటీర్



వలంటీర్ల సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త హనిమిరెడ్డి

- నియోజకవర్గ సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

జే.పంగులూరు: ప్రభుత్వ పథకాలు ప్రతి లబ్ధిదారునికి అందే విధంగా గత ఐదేళ్లలో వలంటీర్లు ఎన్నో సేవలు చేశారని అద్దంకి వైఎస్సార్ సీపీ నియోజకర్గ సమన్వయకర్త పాణెం చిన హనిమిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పంగులూరు టీటీడీకళ్యాణ మండపంలో మండల కన్వీనర్ స్వయంపు హనుమంతురావు ఆధ్వర్యంలో మంగళవారం వలంటీర్ల సమావేశం జరిగింది. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన హనిమిరెడ్డి మాట్లాడుతూ కింది స్థాయిలో వలంటీర్లకు మంచి పట్టుందన్నారు. తమ పరిధిలోని వారు ఏ పార్టీకి ఎంత మంది ఉన్నారో కూడా వారికే తెలుసన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రతి లబ్ధిదారునికి తెలియజేయాలన్నారు. సార్వత్రి ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తేనే ప్రస్తుతం అమలు అవుతున్న పథకాలు, వలంటర్ వ్యవస్థ ముందుకు సాగుతుందన్నారు. ప్రతి వలంటీరు పార్టీ గెలుపు కోసం తమ వంతు కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేస్తే అద్దంకి నియోజక వర్గం నుంచి 40 వేలు ఓట్ల మెజార్టీతో గెలుస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు బీవీ కృష్ణారెడ్డి, జిల్లా నాయకులు పులికం కోటిరెడ్డి, రాష్ట్ర వడ్డెర సంఘం కార్పోరేషన్ డైరెక్టర్ పల్లపు రాము, కౌన్సిల్ సభ్యులు ఖాశీం తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లలో వేగం పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నాగమ్మ

జే.పండులూరు: మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో మార్చి నెల చివరకు నూరు శాతం పన్ను వసూలు చేయాలని ఎంపీడీవో మాథ్యుబాబు కోరారు. గ్రామాల్లో శానిటేషన్ సక్రమంగా నిర్వహించాలన్నారు. మండల పరిధిలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తేళ్ల నాగమ్మ అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అధికారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుచుకుంటూ గ్రామాల్లో అన్ని రకాల సేవలు అందించాలని కోరారు. పన్నులు సకాలంలో వసులు చేయడం ద్వారా గ్రామాభివృద్ధి చేసుకోవచ్చన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా పంచాయతీలు సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. ఆర్‌డబ్ల్యూ ఏఈ శివయ్య మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగు నీరు అందించేందుకు కృషిచేస్తున్నామన్నారు. అనంతరం పీఆర్‌ఏఈ రామ్‌కుమార్ మాట్లాడుతూ చేసిన పనులకు వెంటనే బిల్లులు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రాయిణి ప్రమీళ, మండల ఉపాధ్యక్షులు యర్రం శ్రీనివాసరెడ్డి, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల పంపిణీ



బాలికలను అభినందిస్తున్న హెచ్ఎం దేవదత్తం, ఉపాధ్యాయులు

చినగంజాం: క్విజ్ పోటీలలో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. మండలంలోని పెదగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో సాంఘిక శాస్త్ర క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు డీ నారాయణరెడ్డి వారికి గైడెన్స్ ఇచ్చి వారిని ప్రోత్సహించారని హెచ్ఎం ఎం దేవదత్తం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డీ నారాయణ రెడ్డి, కే నాగరాజు, ఏ సుబ్బరాజులు, చైర్మన్ వీ ఉదయ భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయం



హనిమిరెడ్డితో పీ.గుడిపాడు గ్రామస్తులు, నాయకులు

- సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

మేదరమెట్ల: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయంగా కనిపిస్తుందని.. అలాగే అద్దంకి నియోజకవర్గంలో కూడా అందరి సహకారంతో ఈసారి వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేయాలని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పాణెం చిన హనిమరెడ్డి అన్నారు. కొరిశపాడు మండలంలోని పీ.గుడిపాడు గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు అద్దంకిలోని పార్టీ కార్యాలయంలో హనిమిరెడ్డిని కలసి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ విజయానికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. సమన్వయకర్తను కలసిన వారిలో సర్పంచ్ తాడి ఆదిలక్ష్మి కృష్ణమూర్తి , రాష్ట్ర పార్టీ జనరల్ సెక్రటరీ రావూరి సుందరబాబు, శానం పెద్ద వెంకకటేశ్వర్లు, శానం చినవెంకటేశ్వర్లు, మందా పిచ్చయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం



రోగికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చీరాల రూరల్: ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం పాతచీరాలలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ వైద్య శిబిరంలో 260 మందికి ఈసీజీ, షుగర్, బీపీ వంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అలానే గుండె సంబంధిత వారికి, కిడ్నీ బాధిత రోగులకు తగు సూచనలు, సలహాలు అందించారు. అలానే రోగ నిర్ధారణ జరిగిన మరో 50 మంది రోగులకు ఒంగోలు కిమ్స్ హాస్పిటల్‌లో ఆరోగ్య శ్రీ,, ఈహెచ్ఎస్ కార్డుల ద్వారా ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించి కార్పోరేట్ స్థాయి వైద్య సేవలు అందించనున్నట్లు వైద్యులు పేర్కొన్నారు. శిబిరంలో వైద్యులు డాక్టర్ రామాంజనేయులు, ఆప్తమాలజిస్ట్ సునీల్, గ్రామస్తులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.